నవతెలంగాణ
1
ఆదిలాబాద్
సోమవారం | 12 ఆగస్టు, 2024 | www.navatelangana.com

సినిమా డైరెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రానికి చెందిన చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహించి తీసిన అలనాటి రామచంద్రుడు సినిమా విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి, మాల సంఘం నాయకులు సింగరి అశోక్, బేర దేవన్న, మేకల మల్లన్న, సూరం భగవాన్, బోండ్ల మల్లయ్య, దాసరి బాబాన్న, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు, రాళ్ల బండి శంకర్, తొగరి భాస్కర్, అయితే పొచ్చన్న తొగరి ప్రకాష్, సూరం ఆనంద్, వెంకటస్వామి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సినిమా తీయడం పట్ల జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు తీయాలని ఆకాంక్షించారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ కరువై వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయాలంటున్నారు.

రాష్ట్రస్థాయిలో తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

- జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. గద్వాల జిల్లాలోని వాల్మీకి భవన్‌లో ఈనెల 10, 11వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ కోచ్ అన్నారపు వీరేష్, తైక్వాండో క్రీడాకారులు శివకుమార్, వనితా రాథోడ్ ఆర్.దివ్యలు ప్రతిభ కనబరిచారు. జిల్లాకి నాలుగు వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. అలాగే అక్టోబర్ నెలలో ఆగ్రాలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ సెక్రటరీ మూట శ్రీనివాస్, కురువ శ్రీహరి, సంతోష్, టెక్నికల్ కమిటీ చైర్మన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి తెలియజేశారు. క్రీడాకారులకు రాష్ట్రస్థాయి తైక్వాండో అసోసియేషన్ గద్వాల జిల్లా మున్సిపల్ ఛైర్మెన్ కేశవ్ అభినందనలు తెలియజేశారు. సహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన విద్యార్థులను క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ శివప్రసాద్, జనరల్ సెక్రటరీ అన్నారపు వీరేష్, ఆఫీస్ సెక్రటరీ ఆకోజి వార్ శృతి అభినందించారు.

బంగారుగూడలో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ ప్రభుత్వం పాఠశాల ఆవరణలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్న పిల్లలు, కంటి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. జిల్లా కేంద్రంలో స్థానిక నేతాజీ చౌక్‌లో గల రితన్య ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నివేధితరెడ్డి, ఆదర్శ రెడ్డిల సౌజన్యంతో నిరుపేదల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. అనంతరం రితన్య హాస్పిటల్ డాక్టర్స్‌ని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రీతన్య హాస్పిటల్స్ సిబ్బంది, బంగారుగూడ కాలనీవాసులు, సొసైటీ సభ్యులు ఆసిఫ్, సాబీర్ పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లోని రెండో అంతస్తులో గల డైస్ సెంటర్‌లో చిన్నారులకు ఈనెల 13న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ రాథోడ్ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్బీఎస్కే (రాష్ట్రీయ బాల స్వాస్త్ కార్యక్రమం)లో 0-18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు గుండె సంబంధిత సమస్యలకు ఈ శిబిరంలో వైద్య చికిత్స అందిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సికింద్రాబాద్ కిమ్స్‌లోని పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు చిన్నారులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందజేస్తారని తెలిపారు. బాధిత పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదిగల ప్రదర్శన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 13న హైదరాబాద్‌లో మాదిగల ప్రదర్శన, మందకృష్ణ మాదిగ ఘన స్వాగతం పలికేందుకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ కోరారు. ఆదివారం పట్టణంలోని స్వీపర్ కాలనీలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 13న ఢిల్లీ నుండి మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌కు వస్తున్నందున లక్ష డప్పులు, లక్షలాదిమందితో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉప్పరి సురేష్ మాదిగ, ఈర్ల శ్రావణ్ మాదిగ, ఇజ్జగిరి అనిల్ మాదిగ, పతమేష్ మాదిగ, ఒరగంటి సతీష్, మంతెన వెంకటేష్, మురళీ, మల్యాల శివకృష్ణ మాదిగ, ముల్కల ఆకాంక్ష్, ఉప్పరి అజయ్, నరేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఏండ్ల నిరీక్షణ.. ఫలించనున్న వేళ..!

- ఏండ్ల నిరీక్షణ.. ఫలించనున్న వేళ..!
- కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయంతో సర్వత్రా హర్షం
- ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలకు ప్రయోజనం

ప్రభుత్వం రేషన్ కార్డుల జారీకి సమాయత్తమవుతోంది. అర్హుల ఏండ్ల నిరీక్షణ ఫలించనుంది. తాజాగా నూతన కార్డుల జారీకి మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకోవడం లబ్దిదారుల్లో ఆనందం కలిగిస్తోంది. అనేక ఏండ్లుగా కొత్త కార్డులు జారీ కాకపోవడంతో వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నాయి. గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కొత్త కార్డుల ప్రక్రియ నిలిచిపోవడంతో బియ్యంతో పాటు వివిధ సౌకర్యాలు నష్టపోయారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీపై నిర్ణయం తీసుకోవడంతో ఏండ్ల ఎదురుచూపులకు తెరపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది వరకు చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించకపోయినప్పటికీ..ప్రత్యేకంగా చేపడుతామని చెప్పడంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. కార్డుల జారీకి అవసరమైన విధివిధానాలు కూడా రూపొందించే పనిలో ప్రభుత్వం నిమగ్నమవుతోంది. త్వరలోనే లబ్దిదారుల చేతికి కార్డులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెల్లరేషన్‌కార్డుకు ఉన్న ప్రాముఖ్యత దేనికి లేదు. ప్రతి ప్రభుత్వ పథకానికి అర్హులుగా ఉండాలంటే ఈ కార్డు కలిగి ఉండటం తప్పనిసరి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వాలు ఈ కార్డులను జారీ చేస్తుంటాయి. వీటి ద్వారా ప్రతి నెలా బియ్యం తీసుకోవడంతో పాటు ఆరోగ్యశ్రీ, పింఛన్లు, ఏదేని ప్రభుత్వ ప్రయోజిత పథకాలు పొందాలంటే ఈకార్డును తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుది. ఇంతటి కీలకమైన ఈ రేషన్‌కార్డుల ప్రక్రియలో ప్రభుత్వాలు చూపించిన నిర్లక్ష్యం అనేక మంది నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో జారీ చేసిన రేషన్‌కార్డులను తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మరోసారి ఆహారభద్రత కార్డుల పేరిట జారీ చేసింది. తర్వాత పదేండ్ల పాటు కొత్త కార్డులు జారీ చేయకపోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన జంటలు, ఈ పదేండ్ల కాలంలో కొత్తగా పెళ్లయిన జంటలు అనేకం ఈ కార్డుల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. ఇన్నాండ్లు రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోలేకపోయారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్డుల జారీపై ప్రకటన చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

త్వరలోనే జారీకి మార్గదర్శకాలు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే సుమారు 7.50లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్ జిల్లాలో 1,88,549, నిర్మల్‌లో 214252, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 137284, మంచిర్యాలలో 204662 కుటుంబాలకు కార్డులున్నాయి. వీటికి అదనంగా సుమారు మరో లక్ష కుటుంబాల వరకు కొత్తగా కార్డుల కోసం దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేస్తోంది. ఇది వరకు ప్రజాపాలన పేరిట చేపట్టిన సభల్లో వివిధ పథకాలకు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ..రేషన్‌కార్డులకు మాత్రం తీసుకోలేదు. వీటికి ప్రత్యేక నిబంధనలు రూపొందించి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించింది. విధివిధానాల ఖరారు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం నియమించగా రెండు రోజుల క్రితం సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం పలు సూచనలు చేసింది. ఈ కార్డుల జారీకి గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, మాగాణి 3.5ఎకరాలు, చెలక 7.6 ఎకరాల వరకు ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారికి అర్హులుగా ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. త్వరలోనే పూర్తిస్థాయి మార్గదర్శకాలు రూపొందించి కార్డుల జారీని చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ కార్డుల దుర్వినియోగంపైనా దృష్టిసారించాలని ప్రభుత్వం భావిస్తోంది. అనర్హులను ఏరివేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ఉద్యమాలే ఊపిరిగా సాగిన బక్కన్నకు అశ్రునివాళి

నవతెలంగాణ- నిర్మల్



ఉపాధ్యాయ, విద్యార్థుల, విద్య, ప్రజా సంక్షేమ ఉద్యమాలే ఊపిరిగా కొనసాగిస్తు శనివారం ఆకస్మికంగా మరణించిన బక్కన్నకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన అంత్యక్రియలలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొని అశ్రునివాళులర్పించారు. పాఠశాల స్థాయి నుండే అభ్యుదయ భావాలు కలిగిన బక్కన్న ఏ రోజు కూడా రాజీ పడకుండా తన మార్గంలో ముందుకు సాగాడని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. బక్కన్న భౌతిక కాయంపై టీఎస్‌యూటీఎఫ్ పతాకాన్ని ఉంచి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. స్మశాన వాటికలో బక్కన్న అమర్ రహే అని నినాదాలు చేసి ఆయన ఆత్మ శాంతికై ఒక నిమిషం మౌనం పాటించి తుది వీడ్కోలు పలికారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. బక్కన్న కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు పరమేశ్వర్, భీమయ్య, గంగాధర్, పోశెట్టి, లింగన్న, రవికుమార్, లక్ష్మణ్, భూమన్న,ఏ.రాజేశ్వర్, ఫాజిల్, శ్రీనివాస్, రాజేశ్వర్, వినోద్, వేణు, మనోహర్, మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ సంఘ నాయకులు మహేష్, అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి నాయకులు శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా రైతు సంఘ నాయకులు బండి దత్తాత్రి, సీఐటీయూ నాయకులు కిషన్, జన విజ్ఞాన వేదిక నాయకులు నారాయణ వర్మ, కొండ రాములు, నర్సయ్య, సుదర్శన్‌లతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని హల్దా గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఏ.పోతన్నతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని గ్రామస్తులు సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అదే విదంగా గ్రామస్తుల సహకారంతో గ్రామ అభివృద్ధి వైపు తీసుకెళ్లానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు దేవేందర్, జీవన్, గ్రామ పెద్దలు, యువకులున్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో

- రెండు గంటల పాటు రోడ్డు దిగ్బంధం

నవతెలంగాణ-తలమడుగు



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సుంకిడి గ్రామ అంతర్‌రాష్ట్ర రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో రెండు గంటల పాటు కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎక్కడక్కడ నిలిచిపోయారు. ఈ సందర్భంగా మండల మాల సంఘం నాయకులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా వారి ఇష్టానుసారంగా సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇస్తుందన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణ పేరుతో కుంపటి రాజేసి మాల మాదిగల మధ్యన రిజర్వేషన్ పేరిట చిచ్చు రేపుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. ఏడుగురు ధర్మాసనంపేరిట అమలు పరుస్తున్న ఎస్సీ వర్గీకరణను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మాల, ఉప కులాలు కలిసి పోరాటం ఉధృతంగా చేపడుతామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. తాంసి, తలమడుగు పోలీసులు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. రాస్తారోకోలో మాల సంఘం నాయకులు గజానన్, రాజేశ్వర్, ప్రకాష్, రమాకాంత్, నేతుల గంగన్న, పోచ్చన్న, బోర్ల రమేష్, ప్రవీణ్, దేవన్న, అఖిలేష్, నరేష్, ప్రతాప్, వినోద్, మల్లేష్, అశోక్, దేవన్న, ఆనంద్, శ్రీనివాస్, రవి, రాకేష్, అడెల్లు, మల్లయ్య పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలి

నవతెలంగాణ ఆదిలాబాద్‌టౌన్

పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రజా సేవాభవన్‌లో ఆదిలాబాద్ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు కంది శ్రీనివాస రెడ్డి దిశా నిర్దేశం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలను పెద్ద సంఖ్యలో గెలుచుకోనేలా క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. ఆయా మండలాలు గ్రామాల నుండి గెలవగలిగే సత్తా ఉన్న వారి పేర్లను సేకరించి పరిశీలిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఎన్నికలేవైనా కాంగ్రెస్ గెలపే లక్ష్యంగా కష్టపడి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ మండల, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుండి ప్రాక్టికల్ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12 నుండి సెమిస్టర్ వన్ ప్రాక్టికల్ తరగతులు ప్రారంభం కానున్నట్లు సైన్స్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్రామ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థులందరూ హాజరుకావాలని పేర్కొన్నారు. వెంట తమ ఐడెంటిటీ కార్డును తీసుకొని రావాలని సూచించారు. ప్రాక్టికల్‌కు హాజరయ్యే విద్యార్థులకు తప్పనిసరిగా 70శాతం హాజరు ఉండాలన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ప్రాక్టికల్ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 7382929601ను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

- కండువా కప్పి ఆహ్వానించిన కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు జరిగాయి. ఆదివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో చేరికల కార్యక్రమం ఏర్పాటు చేయగా కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల శంకరయ్య, తాలూక పద్మ శాలిసంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, ఆత్రం రమాదేవి ఆధ్వర్యంలో 34వ వార్డ్ శాంతి నగర్ కాలనీ నుండి బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ చేనేత ఐక్య వేదిక ఉపాధ్యక్షులు మోర ఆశన్నతో పాటు పద్మ శాలి కులస్తులు, కాలనీవాసులు పార్టీలో చేరారు. అలాగే చిలుక సతీష్ ఆధ్వర్యంలో రూరల్ మండలం జందాపూర్ నుండి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఎం.ఏ షకీల్ ఆధ్వర్యంలో ఖానాపూర్ నుండి పలువురు పార్టీలో చేరారు. అందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని అందుకే గరీబోళ్ల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ స్థలంలో భూములున్న యాపల్‌గూడ రైతులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ బెదిరించడం సరికాదన్నారు. ఎకరాకు రూ.16 లక్షలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెబితే ఇప్పుడు ఎకరాకు రూ.8 లక్షలు మాత్రమే ఇస్తామనిచెప్పడం, భూములివ్వకుంటే కట్టేసి భూములు లాక్కుంటామని రైతులను బెదిరించడాన్ని ఆయన తప్పు బట్టారు. తాను ఉండగా రైతులకు అన్యాయం జరిగితే సహించనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు గిమ్మ సంతోష్, భూమన్న, మాజీ ఎంపీటీసీలు జంగు పటేల్, చిట్యాల భూమన్న, నాయకులు బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, షేక్ మన్సూర్, అనుముల ఊషన్న, మహాకాల్ అజయ్, ఎంఏ ఖయ్యూమ్, క్యాతం శివ ప్రసాద్ రెడ్డి, భూమన్న, రాజీవ్, చంద్రకాంత్ రెడ్డి, రమేష్, ఎల్మ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల నాయకులు రాథోడ్ బిక్కు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో గాంధీచౌక్ వద్ద బీజేపీ నాయకులతో కలిసి ప్రజలకు త్రివర్ణ పతాకాన్ని అందించారు. ప్రజలందరూ తమతమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
సోమవారం | 12 ఆగస్టు, 2024 | www.navatelangana.com

జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జిని కలిసిన న్యాయవాదులు

నవతెలంగాణ-ఉట్నూర్



బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరణ కోసం ముఖ్యఅతిథులుగా వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు వినోద్ కుమార్, లక్ష్మణ్, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి సృజనలను ఆదివారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి, కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాపురెడ్డి, బానోత్ జగన్, కోశాధికారి చింతల గిరి, బానోత్ జైవంత్‌రావు, పవార్ వసంత్‌రావు, కుడెల్లి అశోక్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ



108 అంబులెన్స్‌లో ఆదివారం గిరిజన మహిళ ప్రసవించింది. మండలంలోని బోరింగ్‌గూడ గ్రామానికి చెందిన దుర్పతబాయి పురిటి నొప్పులతో బాధపడుతూ 108 సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకొని ఆస్పత్రికి తరలిస్తుండగా సిరికొండ గ్రామ సమీపంలో అంబులెన్స్‌లోనే పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం పిట్ట బొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని ఈఎంటి కాశీనాథ్, పైలెట్ గోపీనాథ్‌లు తెలిపారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం



నవతెలంగాణ-కుభీర్

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో మండలంలోని లింగి గ్రామస్తులకు రూ.10లక్షల ఎస్‌డీఎఫ్ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని, ఎన్ని బోర్లు వేసిన నీళ్ల పడకపోవడంతో శాశ్వత పరిష్కారం కోసం పైపు లైన్ మంజూరు కోసం మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని అందజేశామని అన్నారు. దీంతో గ్రామస్తులు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తూము రాజేశ్వర్, కందుర్ సంతోష్, మల్లేష్, పెంటాజీ, దత్తుగౌడ్ దత్తురాం పటేల్, మల్లారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

- హైకోర్టు న్యాయమూర్తులు
- జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-బోథ్

కోర్టుల్లో పెండింగ్ కేసుల పరిష్కరం కోసం పోలీసు, న్యాయవాదుల సహకారంతో కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తులు వినోద్ కుమార్, సుజన, లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టు భవనం, రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించారు. అంతకు ముందు సాయుధ పోలీసుల ద్వారా గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మేళ తాళాలతో వెళ్లి శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ బోథ్‌లో జూనియర్ సివిల్ కోర్టు భవనం, రెసిడెన్షియల్ భవన నిర్మాణం చేపట్టడం ఎంతో శుభ సూచకమని అన్నారు. ఈ నిర్మాణ పనులను ఏడాది లోపు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాకు ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో భూమి పూజ చేయడం సంతోషమన్నారు. భవన నిర్మాణం పనులలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సమావేశం అనంతరం జిల్లా పాలనాధికారి శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి శివరాం ప్రసాద్, న్యాయమూర్తులు ప్రమీల జైన్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, లాయర్లు ఉన్నారు.

ఎల్వత్ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-భైంసా

తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదివారం పర్యటించారు. గ్రామంలో బుల్లెట్ పై తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులతో కలిసి రోడ్లను పరిశీలించారు. ఎల్వత్ నుంచి కార్బల గ్రామం వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతినడంతో ఆ వైపు రాకపోకలు నిలిచిపోయే ఆస్కారం ఉంది. తక్షణమే మరమ్మత్తులు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పంచకట్టుతో బుల్లెట్‌పై తిరుగుతూ సమస్యలు తెలుసుకోవడం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల నాయకులు శివాజి పటేల్, మాజీ సర్పంచ్‌లు చక్రధర్ పటేల్, సిందే హన్మంత్, అశోక్, సురేష్ ఉన్నారు.

నూతన గ్రామపంచాయతీ ఏర్పాటుతో హర్షం



నవతెలంగాణ-తాంసి

మండలంలోని గిరిజన గ్రామమైన అట్నంగూడా గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు అధికారికంగా ప్రకటన రావడంతో ఆదివారం ఆ గ్రామ ప్రజలు డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డితో పాటు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే ఉద్యేశంతో ఈ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడం సంతోష దగ్గ విషయమన్నారు. ఆగస్టు 15న రెండు లక్షల రుణమాఫీ రైతులకు పూర్తికావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రామన్న యాదవ్, శ్రీధర్‌రెడ్డి, నరేష్, నారాయణ, అన్ను పటేల్, గ్రామస్తులు ఉన్నారు.

యోగి రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్థిక భారంతో ఆత్మహత్యకు పాల్పడిన వరంగల్ జర్నలిస్ట్ యోగి రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్ అన్నారు. యోగి రెడ్డి మృతికి సంతాపంగా ఆదివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్ దేవేందర్ మాట్లాడుతూ అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజా సమస్యలపై ప్రయోగించిన యోగి రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో తన కూతురుతో పాటు ఆత్మహత్య చేసుకోవడం జర్నలిస్టు లోకాన్ని కలచివేసిందని అన్నారు. కనీసం ఇంటి అద్దె చెల్లించలేని దుస్థితిలో యోగి రెడ్డి కుటుంబం ఉండడం బాధాకరమన్నారు. సమాజ హితం కోసం ప్రతిరోజు అహర్నిశలు కృషి చేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం మూలంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు హక్కులను కాపాడుతూ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరిట కాలయాపన చేసిందని, ఈ ప్రభుత్వమైనా యోగి రెడ్డి ఆత్మహత్యతో అయిన స్పందించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ బీర్‌కుర్‌వార్ వెంకటేష్, జర్నలిస్టులు సురేష్, నరేష్, రఘు, సారంగపాణి, సందేశ్, అశోక్, లెనిన్, సుధాకర్, సుభాష్, పేరోజ్, అస్మాత్, నిలేష్, కీజర్, హామిన్, అరుణ్ రెడ్డి, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : వరంగల్ జిల్లాలో యువ జర్నలిస్ట్ యోగి రెడ్డి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జర్నలిస్టు అందర్నీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని జర్నలిస్ట్ సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మనవహారాన్ని చేపట్టారు. యోగి రెడ్డి చిత్రపటం వద్ద క్యాండిల్ వెలిగించి ఘనంగా నివాళు లర్పించారు. సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి యోగి రెడ్డి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



నవతెలంగాణ-సిరికొండ

మొక్కలు నాటి సంరక్షించాలని సంత్ శ్రీ నారాయణ మహారాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శివాలయం, హనుమాన్, ప్రభుత్వ పాఠశాలలో సనాతన ధర్మసేవ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అన్నారు. ప్రతి జీవి మనుగడకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ సేవ సమితి సభ్యులు లక్కం మల్లేష్, ఎగ్గిడి నడిపి మల్లేష్, కృష్ణమూర్తి, కిషన్, సందీప్ పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-భైంసా

వరంగల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ యోగిరెడ్డి అనే జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జావిద్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలో వారు మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. యజమాన్యాలు తక్కువ వేతనాలు ఇవ్వడంతో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే పాత్రికేయులు కష్టాల్లో ఉన్నారని, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాల్సిందిగా కోరారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాటు జర్నలిస్టులను పట్టించుకోలేదని, ఇకనైనా కాంగ్రెస్ సర్కార్ యోగిరెడ్డి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జర్నలిస్టులు బషీర్, విలాస్, మురళి, హన్మాండ్లు, సత్యనారాయణ, భాస్కర్ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో మంగళవారం నిర్వహించనున్న ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి కోరారు. ఆదివారం మండలంలోని లక్కారం గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రగతిశీల మహిళా సంఘం నిరంతరం మహిళల హక్కుల కోసం, మహిళా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని, మహిళలపైన జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా, మహిళలపై ఆకృత్యాలకు వ్యతిరేకంగా, సారాకు వ్యతిరేకంగా, బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా, కల్తీ సారాకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందని అన్నారు. అలాగే స్త్రీ, పురుష సమానత్వం కోసం, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెర్క గంగమ్మ, లక్ష్మి, రాధలు పాల్గొన్నారు.

జిల్లాకు రాంజీ గోండ్ నిర్మల్ జిల్లా అని పేరు పెట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాకు రాంజీ గోండ్ నిర్మల్ జిల్లా అని పేరు పెట్టాలని టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా టీఏజీఎస్, టీపీవీఎస్ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వారోత్సవ సభలు జిల్లా కేంద్రంలో ఆదివారం టీఎన్జీఓ భవనంలో ముగిశాయి. ఈ సందర్భంగా బహిరంగ సభ, సంస్కృతి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కళాకారులు సంప్రదాయక కళరూపాలను ప్రదర్శించగా ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్ జిల్లాకు ప్రముఖ స్వతంత్ర ఉద్యమ నాయకుడు, అమరవీరుడు, అమరుడు రాంజీ గోండ్ నిర్మల్ జిల్లాగా పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ సభ తీర్మానించిందని తెలిపారు. అలాగే ట్రైబల్ స్టేటస్ సర్కిల్ ఏర్పాటు చేయాలని, ఆదివాసీ సదస్సు కోరిందన్నారు. ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అన్ని ఆదివాసీ గూడెలకు రోడ్లు, త్రిఫేస్ కరెంటు, మంచినీళ్లు, అంగన్‌వాడి కేంద్రాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సభ తీర్మానించింది. ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర నాయకులు రాజు, జిల్లా కార్యదర్శి తొడసం శంభు, టీపీవీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బైరి రమేష్, కృష్ణ కుమార్, ప్రజా సంఘాల నాయకులు సూర్యభాన్, సత్యనారాయణ, విజయ్, సంతోష్, పుష్పలత, సుమిత్ర, నర్మదా, వనిత, సుజాత, ఆదివాసి గింజలు పాల్గొన్నారు.





మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని శ్యాంపూర్ గ్రామంలో సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నబావు సాతే విగ్రహం దగ్గర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకులు కాంబ్లే బాలాజీ మాట్లాడుతూ ఈనెల 13న హైదరాబాద్ రాజధానిలో అడుగు పెడుతున్న మందకృష్ణ మాదిగకి స్వాగతం పలకటానికి ఆదిలాబాద్ జిల్లాలోని మాదిగ ఉపకులాలు హైదరాబాద్‌లో విజయ దండోరా నిర్వహించడానికి అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ రాందాస్, తోట్రే అశోక్, మాజీ సర్పంచ్ కొడేకర్ కేశవ్, కాంబ్లే యువరాజ్, కొడేకర్ దత్త మహారాజ్, బండే అశోక్, ఆనందరావు, రాహుల్, వాగ్మారే విశాల్, ఆనందరావు జాదవ్, ఆకాష్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా కన్వీనర్ కైలాస్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్‌లో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలో స్వాతంత్ర్యం రాక ముందు 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఏర్పడిన మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ చరిత్రలో నిలిచిందని వెల్లడించారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో ఉద్యమాలు చేసి విద్యార్థుల పక్షాన ఉన్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. అధిక సంఖ్యలో సభ్యులు విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

'నైపుణ్యాలు ఉన్నవారికి అవకాశాలు కొదవలేదు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిజిటల్ యుగంలో నైపుణ్యాలు ఉన్నవారికి అవకాశాలు కొదవ లేవని, స్థానిక కళాకారులకు సరైన రీతిలో ప్రోత్సాహం అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయని ప్రముఖ సినీ ప్రొడ్యూసర్, సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కైలాస్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి డబ్బింగ్ రికార్డింగ్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించారు. స్టూడియో లోపల అందుబాటులో ఉంచిన డబ్బింగ్ రికార్డింగ్‌కు సంబంధించిన అధునాతన పరికరాలను పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. అనంతరం కార్యక్రమ అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పట్టణానికి చెందిన ప్రముఖ యాంకర్, నటుడు సుదీర్ హీరోగా నటించిన సినిమా సైతం త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఆ చిత్రానికి సంబంధించిన వివరాలను కార్యక్రమంలో ప్రకటించి, దర్శక నిర్మాతలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ స్థానికంగా ఉండే కళాకారుల సౌకర్యం కోసం రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. యూట్యూబ్ ద్వారా అనేక మంది కళాకారులు ప్రజాదరణ పొందుతున్నారని, పాటలు, షార్ట్ ఫిలింలతో కళాకారుల దశ మారుతోందని అన్నారు. సినీ నిర్మాతలకు సైతం కొత్త టాలెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేసే ఆస్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటూ కళారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రికార్డింగ్ స్టూడియో ప్రొప్రైటర్ పసుపుల దేవిదాస్‌తో పాటు పలువురు కళాకారులు, సినీ ప్రియులు పాల్గొన్నారు.

రెండో జత యూనిఫామ్‌ల వస్త్రాల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాకు చేరిన రెండో జత ఏకరూప దుస్తుల వస్త్రాలను మండలాల వారీగా పంపిణీ చేశామని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎన్. ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో జత ఏకరూప దుస్తుల వస్త్రం జిల్లాకు 30న చేరిందని, టిస్కో సభ్యులు నిర్మల్ జిల్లాకు చేరుకొని, వచ్చిన పూర్తి వస్త్రమును మండలాల వారీగా విభజన చేయడం జరిగిందని తెలిపారు. మండలాల వారీగా విభజించిన వస్త్రం, ఆయా మండలాలకు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 19 మండలాల వస్త్రాన్ని మండలాల వారి విభజన చేసి ఎన్టీఆర్ స్టేడియంలోని మొదటి అంతస్తులో భద్రపరిచామని, అక్కడి నుంచి ఇప్పటివరకు 16 మండలాలకు పంపిణీ చేశామని, మిగతా మండలాలకు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వచ్చిన వస్త్రాన్ని పరిశీలించుకొని, పాఠశాలల వారిగా విభజించి, స్వయం సహాయక గ్రూపులకు అందజేసి, రెండో జత దుస్తులను కుట్టించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో సోమవారం అర్హులైన దివ్యాంగులకు ప్రయాణంలో 50శాతం రాయితీతో కూడిన బస్ పాసులను అందచేస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో రూ.50లు తీసుకొని ఎంపీడీఓ కార్యాలయానికి రావాలని సూచించారు. దివ్యాంగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షులు అరెల్లి రాజలింగం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్నూర్ నుంచి ఇంద్రవెల్లి వరకు తిరంగా యాత్ర బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని బీజేపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, బైక్ ర్యాలీకి విజయంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతథులుగా జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం, రాష్ట్ర యువ నాయకులు రితేష్ రాథోడ్ హాజరు కానున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కనక తుకారాం, చంపత్‌రావ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : బంగ్లాదేశ్‌లో మైనారిటీ ప్రజలైన హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, బింగి వెంకటేష్, కాల్వ రవి, టేకం హరిప్రసాద్, బొడ్డు కిరణ్, తన్నీరు సతీష్, ఇప్ప మధుకర్, సడిగె రాజేశ్వర్, దేవిదాస్, ఉపేందర్, రాథోడ్ శేషారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆస్పత్రి తనిఖీ

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని కౌటాల పీహెచ్‌సీని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతులపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు వైద్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యుల కొరత లేకుండా త్వరలో పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట డీఎంహెచ్‌డో డాక్టర్ తుకారం భట్, డీప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాం, ఎన్‌సీడీపీఓ వినయ్ కుమార్, వైద్యులు తస్మియ, క్రిష్ణవేణి సిబ్బంది ఉన్నారు.

వంతెన నిర్మించాలి

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని లెండిగూడ ఘాట్ సమీపంలోని ఒర్రెపై వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతంలోని గుట్టలపై ఏ మూలన వర్షం కురిసిన ఈ ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుంది. నీటి ప్రవాహం తగ్గే వరకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. దీంతో నిత్యం రాకపోకలు కొనసాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి రోడ్డంతా కొట్టుకుపోయి రాళ్లుదేలింది. ఈ ఒర్రెపై వంతెన నిర్మాణం చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కుక్కను హతమార్చిన పెద్దపులి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని పరందొలి గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డులో పెద్ద పులి కుక్కను హత మార్చింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం పరందొలి గ్రామానికి వెళ్లే క్రమంలో ఘాట్ రోడ్డు నుంచి సుమారు 2 కిమీ దూరంలో కుడి వైపున గల అటవీ ప్రాంతంలో రాత్రి పెద్ద పులి కుక్కను హతమార్చింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు చూశారు. పెద్దపులి హతమార్చినట్లు అనవాలు కనింపించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా చేన్లకు వెళ్లేందుకు హడలిపోతున్నారు.

మున్సిపాలిటీలో పర్మిషన్ల పంచాయతీ..!

- నూతన గృహ నిర్మాణానికి అనుమతుల అవస్థలు
- రుణం కోసం చూస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇల్లు నిర్మించాలంటే ఎన్నో రకాల నిబంధనలు పాటిస్తూ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకు రుణంపై ఆధారపడి ఇల్లు నిర్మాణం చేపట్టే వారికి అనుమతులు ప్రధానం. ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవతరించినప్పటికీ ఇంకా రికార్డులు పూర్తి కాకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేసుకునేవారు అవస్థలు పడుతున్నారు.

మున్సిపాలిటీలో పర్మిషన్ల 'పంచాయతీ'

గ్రామపంచాయతీ నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారుస్తూ 2023లో బీఆర్ఎస్ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. 2024 ఏప్రిల్ ఒకటి నుండి అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం తదనంతర పరిణామాల ఫిబ్రవరి 1 నుండి మున్సిపాలిటీ అమల్లోకి వచ్చింది. ఇప్పుడు ఇదే ఇంటి నిర్మాణాలు చేసుకునేవారికి ఇబ్బందిగా తయారైంది. 7 నెలలు పూర్తయిన డిజిటల్‌కి తప్ప, మున్సిపాలిటీ సరిహద్దులు వార్డులు గుర్తింపు ప్రక్రియ కూడా ఇంకా పూర్తి కాలేదు. దీనితో ఇంటి నిర్మాణాలకు ఇచ్చే పర్మిషన్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇంటి నిర్మాణం అనుమతి కోసం టీఎస్ బీ పాస్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే మున్సిపాలిటీ ప్రక్రియ పూర్తికాకపవడంతో ఆన్‌లైన్‌లో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ చూపడం లేదు. దీంతో ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో పర్మిషన్ల పంచాయతీ కొనసాగుతోంది.

నూతన గృహ నిర్మాణానికి రాని అనుమతులు

మున్సిపాలిటీగా మారడంతో పాటు జిల్లా అభివృద్ధి చెందడంతో గతంతో పోలిస్తే జిల్లాలో నూతన వెంచర్లు పెరిగాయి. వీటిలో గృహ నిర్మాణాలు చేసుకునే వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుంది. గతంలో గ్రామ పంచాయతీ ఉండగా 10 నుండి 15 ఇంటి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చేవి. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడం, జిల్లాగా అవతరించడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మున్సిపాలిటీగా మారడానికి పూర్తిస్థాయి నిర్మాణం పూర్తి కాకపోవడంతో గత 7 నెలల నుండి అనుమతులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

రుణం కోసం చూస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు

ఇంటి నిర్మాణం చేయాలంటే టీఎస్ బీ పాస్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత మున్సిపాలిటీ అధికారులు పత్రాలను చూడడంతో పాటు స్థలాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. బ్యాంకుల రుణంపై ఆధారపడి ఇంటి నిర్మాణాలు చేపట్టేవారికి అనుమతుల అవసరం ఉంటుంది. రెండు నెలల నుండి అనుమతులు లేకపోవడంతో వెంచర్ల యజమానులు, నూతన గృహ నిర్మాణ ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆఫ్‌లైన్‌లో అనుమతి ఇస్తే కొంత వెసులుబాటు

ప్రస్తుతం కొనసాగుతున్న అనిచ్ఛితి పోవాలంటే అధికారులు గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఇచ్చిన విధంగా ఆఫ్ లైన్ అనుమతి ఇస్తే ఇంటి నిర్మాణదారులకు కొంత వెసులుబాటు కలుగుతుంది. ఇంటి నిర్మాణదారుల ఇబ్బందులను అర్థం చేసుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనుమతి కోసం ఎదురుచూస్తున్నాను

ఆనంద్, స్థానికుడు.

ఇంటి నిర్మాణం కోసం మంచి రోజులు ఉండడంతో గత నెల 18వ తేదీన భూమి పూజ చేశాను. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే టీఎస్ బీ పాస్‌లో దరఖాస్తులు స్వీకరించడం లేదు. దీనితో బ్యాంకు రుణం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. అనుమతి కోసం ఎదురుచూస్తున్నాను. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

"డిజిటల్ కీ" మున్సిపాలిటీ నక్ష ఇంకా రాలేదు

భుజంగరావు, మున్సిపల్ కమిషనర్.

నూతనంగా మున్సిపాలిటీ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీకి సంబంధించిన సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ ఇప్పుడిప్పుడే కొనసాగుతోంది. అలాగే ఆన్‌లైన్ పరిమితుల కోసం డిజిటల్ కీ ఆలస్యంగా రావడంతో అనుమతులు కొంత ఇబ్బంది అవుతున్నాయి. సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తికాగానే అనుమతులు ఇస్తాం.

కౌటాల సీఐగా ముత్యం రమేష్

నవతెలంగాణ-కౌటాల



కౌటాల సీఐగా ముత్యం రమేష్ శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించినారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ సాదిక్ పాషా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెంలో విధులు నిర్వహించి బదిలీపై కౌటాల సర్కిల్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలలో శాంతి భద్రతలతో పాటు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సామాజిక పరిరక్షణ కోసం పని చేస్తామన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఏజెన్సీలో విలవిల్లాడుతున్న పల్లెలు
- రెండు రోజుల్లో ఇద్దరు మృతి
- ఆస్పత్రులకు వరుసకడుతున్న జ్వర బాధితులు
- భయందోళనలో జనం..

సీజనల్ వ్యాధులు జనాలను బెంబెలెత్తిస్తున్నాయి. విషజ్వరాలు విజృంభించడంతో ఏజెన్సీ పల్లెలు విలవిల్లాడుతున్నాయి. గ్రామాల్లో ఇంటికి ఒకరి చొప్పున మంచం పట్టిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈక్రమంలో రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. అనేక మంది జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు పరుగులు పెడుతుండగా..మరికొందరు స్థానిక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. వైద్య శాఖ శిబిరాలు నిర్వహిస్తున్నా పారిశుధ్య లోపం కారణంగా పూర్తి స్థాయిలో జ్వరాలు అదుపులోకి రావడం లేదని తెలుస్తోంది. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించి జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

నవతెలంగాణ-కౌటాల

కుమురం భీం- ఆసిఫాబాద్ జిల్లాలో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో జనం సతమతమవుతున్నారు. వేలాది మంది ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. భిన్నమైన వాతావరణం నెలకొంది. ఓ వైపు వర్షాలు, మరోవైపు విపరీతమైన ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు జ్వరం వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మలేరియా, టైఫాయిడ్, వైరల్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వారం రోజుల క్రితమే ఏజెన్సీలో 25కు పైగా డెంగ్యూ జ్వరాలు నమోదు కాగా తాజాగా మరింతగా అధికమైనట్లు తెలుస్తోంది. వీటికి తోడు అనేక మంది కాళ్లు, కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలతో ప్రభుత్వ, ప్రైయివేటు ఆస్పత్రులకు జనాలు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు ఓపీ పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. ఇంట్లో ఒకరితో మొదలైన జ్వరం కుటుంబ సభ్యులంతా జ్వరాల బారిన పడుతుండటంతో భయాందోళన చెందుతున్నారు. విష జ్వరాలు మారుమూల గ్రామాల్లో, తండాలతో పాటు పట్టణాల్లో సైతం ఎక్కువగా నమోదవుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో కౌటాల మండలంలో ఇద్దరు జ్వరంతో మరణించడంతో హడలెత్తిపోతున్నారు.

రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు...

నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతు ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. జాడి కిశోర్ సురేఖ దంపతులకు ముగ్గురు సంతానం కాగ పెద్ద కుమార్తె పూజా (16) కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల వసతి గృహ పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. పూజాకు జ్వరం రావడంతో ప్రిన్సిపాల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం పూజ తండ్రి కిశోర్ అక్కడికి వెళ్లి కూతురును ఇంటికి తీసుకు వచ్చి స్థానిక ఆర్ఎంపీతో వైద్యం చేయించాడు. జ్వర తీవ్రత ఎక్కువగా కావడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు తీసుకెళ్ళాడు. అక్కడ కూడా తగ్గకపోవడంతో అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలో శనివారం రాత్రి చనిపోయింది. అదే గ్రామానికి చెందిన బోయిరె కాళీదాస్ (32) నాలుగు రోజులుగా జ్వరం రావడంతో స్థానికంగా ఆర్ఎంపీతో వైద్యం చేయించాడు. తగ్గక పోవడంతో మంచిర్యాలలో ఓ ప్రైయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఇద్దరు ఒకే రోజు చనిపోవడంతో ఆ రెండు కుటుంబాలు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



జ్వరంతో మంచం పట్టిన గుండాయిపేట్ గ్రామస్తుడు దుర్గం దివాకర్

మంచం పట్టిన మండలం...

మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటిలో ఒకరు లేదా ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేక రోగులకు శాపంగా మారింది. గుండాయిపేట్‌లో కూడా సబ్ సెంటర్ ఉన్నప్పటికీ అక్కడ వైద్యులు లేక ఆర్ఎంపీలే దిక్కవుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని అందిన కాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కేవలం ప్రాథమిక వైద్యానికే పరిమితం కావాల్సి ఉండగా బెడ్లు ఏర్పాటు చేసి సెలైన్లు పెడుతూ చికిత్సలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఆర్ఎంపీలు అధిక డోస్ ఇవ్వడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్న సంఘటనలున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియామకం చేసి ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎక్కువ..

సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విష జ్వరాల కేసులు నమోదవుతాయని, అయితే ఈ నెలలో కూడా డెంగీ, మలేరియా కేసులు అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. జ్వరాల నియంత్రణకు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా తరుచూ నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు సోకుకండా చేతులను శుభ్రం చేసుకోవాలని, మాస్కులను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు.



జ్వరంతో మృతి చెందిన పూజ.. ఇన్‌సెట్‌లో పూజ(ఫైల్)



జ్వరంతో మృతి చెందిన కాళిదాస్..ఇన్‌సెట్‌లో కాళిదాస్(ఫైల్)

గద్దర్ జీవితం భావితరాలకు తెలిసేలా కార్యాచరణ

- గద్దర్ సంస్మరణ సభలో ఓయూ ప్రొఫెసర్ ఖాసిం



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘాల నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజా యుద్ధనౌక గద్దర్ జీవితం రాబోయే తరాలకు కూడా తెలిసేలా కార్యాచరణ ఉండాలని పలువురు మేధావులు అన్నారు. ఆదివారం స్థానిక సంతోష్ ఫంక్షన్ హాలులో గద్దర్ సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఖాసిం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సామాజిక ఉద్యమకారులు అంతడుపుల నాగరాజు, సుందిళ్ల రాజన్నతో పాటు పలు సంఘాల నాయకులు హాజరయ్యారు. ముందుగా గద్దర్ చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రొఫెసర్ ఖాసిం మాట్లాడుతూ గద్దర్ పీడిత వర్గాల పక్షాన కాలికి గజ్జె కట్టి ఆ వర్గాల ప్రజలను చైతన్యం చేశాడన్నారు. గ్రామాలలో వేళ్లానుకపోయిన సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు ఆయన ఆటా, పాటలు ఎంతగానో పని చేశాయని అన్నారు. పేదరికం నుండి వచ్చిన గద్దర్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల అభిమానాలను చురగొన్నాడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలను ఒక తాటిపై తెచ్చేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. జీవితం చరమాంకం వరకు కూడా గద్దర్ ప్రజల కోసమే పని చేశాడన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల మనిషి గద్దర్ అని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు తన ఆటా పాటా ద్వారా ఎదిరించాడని గుర్తుచేశారు. ప్రజా సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశాడని కొనియాడారు. తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ పేరు, కీర్తి వచ్చినా ఏనాడూ హంగు, ఆర్భాటాలకు పోలేదని అన్నారు. సాధారణ జీవితాన్ని గడిపిన గద్దర్ అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. సుందిళ్ల రాజన్న మాట్లాడుతూ కడు పేదరికంలో పుట్టిన గద్దర్ ఆ వర్గాల సమస్యలు తెలుసుకొని వారిని చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాడని అన్నారు. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. ఆహ్వాన సంఘం కన్వీనర్ అల్లి రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోశాధికారి జయదేవ్ అబ్రహంతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సిడాం గణపతి, కొంగ సత్యనారాయణ, వి శాంతికుమారి, రాజకమలాకర్‌రెడ్డి, యుఎస్ చారి, కటకం మధూకర్, ఎ శ్రీనివాస్‌రావు, పొన్న రమేష్, కోట శ్రీనివాస్, తాజుద్దీన్, బి నర్సయ్య, ఎం సుభాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసిం

బాధ్యతలు స్వీకరించిన జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాకి బదిలీపై వచ్చిన ఎం. శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనతో పాటు ఎస్ఓ టూ జీఎంగా కే.రాజమల్లు బాధ్యతలు చేపట్టారని అధికార ప్రతినిధి రెడ్డిమళ్ల తిరుపతి తెలిపారు. బెల్లంపల్లి ఏరియా అధికారులు వారిని శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఏరియాలోని స్థితిగతులను జీఎం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీజీఎం నరేందర్, గోలేటి ఓసీ పీఓ ఉమాకాంత్, ఏరియా ఇంజనీర్ భీమ్‌రావు జాడె, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

జీఎం, ఎస్ఓ టూ జీఎంలకు సన్మానం

బెల్లంపల్లి ఏరియా జీఎం, ఎస్ఓ టూ జీఎంగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా ఖైరిగూడ ఓసీకి వచ్చిన జీఎం ఎం. శ్రీనివాస్, ఎస్ఓ టూ జీఎం రాజమల్లును ఓసీ అధికారులు శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఖైర్‌గూడ ఓసీ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులపై ఆరా తీశారు. కార్యక్రమంలో గోలేటీ ఓసీ పీఓ ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్ వీ.పాటింగ్, సీఎంఓఏఎల్ ప్రెసిడెంట్ మధుసూధన్, సంక్షేమ అధికారి వేణు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శించిన సీఐ

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం కౌటాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ముత్యం రమేష్ సందర్శించారు. కౌటాల సీఐగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌ను వచ్చిన సీఐని ఎస్సై స్వాగతం పలికారు. బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. మారుమూల ప్రాంతం కావడంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆదేశించారు. పరిసరాలను పరిశీలించి స్టేషన్‌కు వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, సూచించారు. ఆయన వెంట ఎస్సై బి.విక్రమ్, పోలీసులున్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

30 ఏండ్ల ఉద్యమంతో సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీవర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈనెల 13న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతంతో పాటు విజయోత్సవ ర్యాలీని చేపడుతున్నామన్నారు. మాదిగ మాదిగ ఉప కులాలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేగుంట కేశవరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గోగెర్ల రాజేష్ మాదిగ, మండల నాయకులు కొరల్ల రాజేందర్ మాదిగ, మండల నాయకులు గోగార్ల రాజేష్ మాదిగ, మండల విద్యార్థి నాయకుడు రోడ్డ శంకర్ మాదిగ, మండల నాయకుడు మాతంగి ప్రసాద్ మాదిగ పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛద పాటించాలి

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బంబార గ్రామ పంచాయతీలోని రాజీవ్ నగర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు గర్భిణీలను ఆస్పత్రిలోనే ప్రసవం కావాలని చెప్పడంతో పాటు ఇద్దరు బాలింతలను ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, జ్వరంతో ఉన్న ఇద్దరి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఎప్పటికప్పుడు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో కూడా పరిశుభ్రంగా ఉంచే విధంగా తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్ఈఓ రవీందర్ అన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సూత్రలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ఈ రజియా, ఏఎన్ఎం గోదావరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మల్యాల బీట్‌లో విలువైన టేకు చెట్ల నరికివేత

నవతెలంగాణ-జన్నారం

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట రేంజ్ మల్యాల బీట్‌లో విలువైన టేకు, ఇతర చెట్లను నరికారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అందుకు కారకులైన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. మహ్మదాబాద్ నుంచి మల్యాల్ వెళ్లే దారిలోని విద్యుత్తు తీగల కింద ఉన్న చెట్లతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కావడంతో ఆ చెట్లను నరికివేసి నట్లు తెలిసింది. మరికొన్ని చెట్లకు గొడ్డలితో కాటు వేసి వదిలి పెట్టారు. ప్రభుత్వం పచ్చదనం కొరకు విరివిగా మొక్కలు నాటుతున్న సందర్భంలో ఇలా అటవిలో ఉన్న చెట్లను ఇష్టాను రీతిగా నరికి వేయడం పట్ల ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు. చెట్లు నరుకుతుండగా అటవీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తాళ్ల పేట రేంజి అధికారిణి సుష్మారావును సంప్రదించగా కొన్ని చెట్లు నరికివేతకు గురికావడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ ఫూ టోర్నమెంట్

నవతెలంగాణ-మందమర్రి



రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ ఫూ బీఎంఆర్ కప్ టోర్నమెంట్‌ను లక్ష్మి భవాని కాలనీలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని జెన్ శిటో- రియు కరాటే స్కూల్ మంచిర్యాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నిహారిక, జాష్మిత, తన్ని, సుశాంత్, మన్యు శ్రీ గౌతమ్, హిమానిక్షిత్, శ్రీ చైత్ర గోల్డ్ మెడల్స్ సాధించగా, హంసి, శ్రీనిధి, శివాంశ, శివ చరణ్, సాయి, అక్షిత్, సింరిత, రిష్షిత, మనీష్ సిల్వర్ మెడల్స్, ప్రావిన్య, అజయ్, శ్రేయాస్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని మాస్టర్ పోచంపల్లి వెంకటేష్ తెలిపారు.

ప్రజలతో మమేకమై వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజలతో మమేకమై వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ బి రవీందర్ నాయక్ అన్నారు. దీపక్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలుతున్నందున సమయపాలన పాటించాలని, అందుబాటులో ఉండాలని ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని అన్నారు. మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని, ప్రభావిత గ్రామాలలో ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్, మున్సిపల్, ఐసీడీఎస్ ఇతర శాఖలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్‌లలో పరీక్షలు, ఫార్మసీ దగ్గర మందులు సూపర్‌వైజర్ సిబ్బంది ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలతో సమన్వయం చేస్తూ అన్ని కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని కోరారు. అదేవిధంగా ఎలాంటి చిన్న చిన్న సమస్యలు ఉన్న జిల్లా వైద్య శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని దానికోసం ప్రజలతో కలిసినప్పుడు ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలియజేయాలని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దోమలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి పాఠశాలల్లో ఐకేపీ గ్రూపులలో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సీతారామరాజు, అనిత, ఫయాజ్, సుచరిత, శివ ప్రతాప్, మానస, సుపండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీఎంఓ ప్రశాంతి పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి



నవతెలంగాణ-మందమర్రి

ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుండి హైదరాబాద్ వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మందమర్రి సింగరేణి హై స్కూల్ మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా వివిధ ప్రభుత్వాలపైన అనేక పోరాటాలు ఉద్యమాలు చేసి చివరిగా సుప్రీం కోర్టు ద్వారా వర్గీకరణ సాధించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వర్గీకరణ సాధనలో 30ఏళ్లుగా మాదిగ జాతి భవిష్యత్తు కోసం కొట్లాడి ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామ గ్రామాన విస్తరింపజేసి మాదిగలకు రావాల్సిన సమాన హక్కులను సుప్రీంకోర్టు ద్వారా సాధించడంలో ప్రధాన పాత్ర పోషించినటువంటి మందకృష్ణ మాదిగ ఈ నెల 13న హైదరాబాదుకు వస్తున్న సందర్భంగా మాదిగలు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు హైదరాబాద్‌కు వచ్చి భారీ స్వాగత ర్యాలీని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు వర్గీకరణను అమలు చేస్తామని తెలిపారని, మాటలకే పరిమితం కాకుండా తక్షణమే అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఇప్పటి వరకు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లలో కూడా వర్గీకరణ అమలయ్యే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం పాటించని కొంతమంది స్వార్థపరులైన మాలలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని వారికి వాళ్ళ కుటుంబం వ్యక్తిగత స్వార్థం మాత్రమే కనబడుతుందన్నారు. కోర్టు తీర్పును తప్పు పట్టడం చాలా బాధాకరమని ఇప్పటికైనా సోదర భావంతో ముందుకు వచ్చి దళితులలో ఇంకా అనేక సమస్యలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల, పట్టణ ఇన్‌చార్జి జీడి సారంగం, మండల అధ్యక్షుడు ఆసంపెల్లి శివకుమార్, ఎంఎస్ఎఫ్ మండల కన్వీనర్ మాడుగుల రాజ్ కుమార్, తాండూర్ మండల ఇన్‌చార్జి జీలకర శంకర్, నందిపాటి రవి, సప్పటి శ్రీనివాస్, బచ్చలి కిషోర్ పాల్గొన్నారు.

లంబాడితాండా(డీ)లో కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితాండ(డీ)లో ఆదివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం(కార్డెన్‌సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు ఈ ప్రాంతంలో ఉంటున్నారా లేదా అపరిచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డ్ పరిశీలించారు. అదే విధంగా ఈ ప్రాంతంలో నివసించే వారి ద్విచక్ర వాహనాలు, ఆటోల ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు తనిఖీ చేశారు. అదే విధంగా సరైన ధ్రువ పత్రాలు లేని, నెంబర్ ప్లేట్ లేని 35 ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటిని అక్కడికక్కడే సరి చేశారు. 4 లీటర్ల లిక్కర్ సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఉద్దేశించి మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలపై అవగాహన, మూఢ నమ్మకాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడినా, భూమి సంబంధిత గొడవలలో పాల్గొన్నా లేదా అమాయకులను మోసం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడమే గాక అట్టి వ్యక్తులపై రౌడీ షీట్ తెరువబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



'ట్రాఫికర్'

- రోడ్లపై విచ్చలవిడిగా నిలుపుతున్న వాహనాలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-మంచిర్యాల

రోడ్ల పైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. నియంత్రణకు అధికారులు చొరవ చూపక పోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల పైనే ఇష్టం వచ్చినట్లు వాహనాలను పార్కింగ్ చేయడంతో పలు సార్లు ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనితో గంటల తరబడి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాల మీద అధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపైనే తీవ్రం

మంచిర్యాల పట్టణంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారితో పాటు మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్, అర్చన టెక్స్ చౌరస్తా, మార్కెట్ రోడ్‌లో ఇష్టాను సారం పార్కింగ్ చేసే వాహనాల వళ్ళ పాద చారులతో పాటు తోటి వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్ మాల్‌కో లేక మార్కెట్ కో వెళ్లే సమాయంలో అక్కడ ఎదురైనా ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో మరో సారి అటు వైపు వెళ్ళాలంటేనే ఆలోచిస్తున్నారు. పట్టణ ప్రజలు, బెల్లంపల్లి చౌరస్తా నుండి రైల్వే స్టేషన్ వరకు ఉన్న రోడ్డుపై నిత్యం ఏదో ఒక ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రోడ్డు ను ఆనుకొని ఉన్న షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్‌కు ఏదో ఒక పని మీద వచ్చే వాహన దారులు వారి వాహనాలను రోడ్డుపై నిలిపి వచ్చిన పని కానిచ్చేసుకుంటున్నారు. ఆ రోడ్డుపై ఉన్న కొన్ని భవనాలకు సెల్లార్లు ఉండగా మరి కొన్ని భవనాలకు సెల్లార్లు లేకపోవడంతో రోడ్ల పైనే వాహనాలు నిలుపుతున్నారు. భవనములో నిర్వహించే వ్యాపారాలకు అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఎన్ని చర్యలు తీసుకునున్నప్పటికీ ఇటు వాహనదారులు, బహుళ అంతస్తుల్లో వ్యాపారాలు కొనసాగించే వారు పెద్దగా పట్టించుకోక పోవడంతో సమస్య తీవ్రమవుతోంది.



సెల్లార్‌లో సైతం వ్యాపారం

మంచిర్యాల పట్టణంలోని రహదారిపై ఉన్న భవనాలకు సెల్లార్లు లేవు, కొన్నింటికి సెల్లార్లు ఉన్న వాటిలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు అద్దెకు ఇచ్చారు. దీనితో వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేక రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. మార్కెట్ రోడ్ లోని బిల్డింగుల్లో కొనసాగుతున్న వ్యాపారాలకు సెల్లార్‌లో పార్కింగ్ అనేది లేదు. దీనితో అట్టి షాపింగ్ మాల్స్‌కి వెళ్లే వారు ఎవరైనా వాహనాలను రోడ్డుపై నిలిపి వెళ్తున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు 92 మంది బిల్డిగ్ యజమానులకు నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ వారి పద్దతిలో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా సెల్లార్లు కాలీ చేయించి అక్కడే వాహనాలను పార్కింగ్ చేసేల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్‌కి వెళ్ళాలి అంటేనే భయం వేస్తోంది

మౌనిత, గృహిణి మంచిర్యాల.



నిత్యం ఏదో పని మీద మంచిర్యాల మార్కెట్‌కి వెళ్తుంటాము. రోడ్డు మీద ఎటు చుసిన వాహనాలు పార్కింగ్ చేసి కనిపిస్తాయి. కూరగాయలు, బట్టలు కొనేందుకు మార్కెట్ వెళ్లిన ప్రతి సారి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. రోడ్డుపై నడవాలంటే కష్టం ఐతుంది. అసలే రోడ్డు చిన్నదిగా ఉంది అందులో అదే రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసే సరికి నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో మార్కెట్‌కి వెళ్ళాలి అంటేనే భయం వేస్తోంది. సంబదిత అధికారులు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాం చూపాలి.

సెల్లార్లు కాలీ చేయిస్తున్నాం

బి సత్యనారాయణ ,ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్.



రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలకు నిత్యం ఫైన్ వేస్తున్నాం. డ్యూటీలో ఉన్న సిబ్బంది ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య రాకుండా వాహన దారులకు సూచనలు ఇస్తున్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడినం, నోటీసులు అందించామని తెలిపారు. నెలలో సెల్లార్లు ఖాళీ అయ్యేలా వారు చర్యలు చేపట్టారు. సెల్లార్లు ఖాళీ చేయించి వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయకుండ సెల్లార్లలో పార్కింగ్ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తాం.

విష జ్వరాలపై ముందస్తు చర్యలు చేపట్టాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లాలో గత నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా వాసూలు విష జ్వరాల భారిన పడే అవకాశం ఉందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పారిశుధ్యం లోపించి దుర్వాసన, దోమల బెడదతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు విష జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా లాంటి జబ్బులకు గురై అల్లాడిపోతున్నారని, వైద్య అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లా ప్రజలు రోగాల బారినపడి అవస్థలు పడుతుంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణల వరకు ఎక్కడికక్కడ పారిశుధ్యం లోపం ఏర్పడి దుర్వాసన, దోమల బెడద విపరీతంగా ఉన్నప్పటికి ఇప్పటివరకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదన్నారు. వైద్య అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ప్రజలను కాపాడడం కోసం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సబ్ సెంటర్ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు బాధితులకు మెరుగైన వైద్యం అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో, పట్టణాల్లో మెడికల్ క్యాంపులు పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. సమావేశంలో దాసరి రాజేశ్వరి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బోడెంకి చందు, ఉమరాణి, సమ్మక్క, సరిత, రాజేశ్వరి, సంధ్య, రేణుక, రమాదేవి, యామిని, మధు, లక్ష్మి, ఎల్లయ్య, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలి



నవతెలంగాణ-వేమనపల్లి

పోడు సాగుదారులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మర్మల మల్లేశ్వరి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బుయ్యారం గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుయ్యారం గ్రామంలో ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నప్పటికీ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు రావాల్సి ఉన్న, ప్రభుత్వాలు ఇవ్వడం లేదన్నారు. అటవీశాఖ అధికారులు పోడు సాగుదారులను వేధింపులకు గురిచేస్తూ వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో బయ్యారం గ్రామానికి చెందిన 21 మంది పోడు రైతులపైన ప్రభుత్వం అటవీశాఖ అధికారుల చేత అక్రమ కేసులు పెట్టించి ఆదివాసీ నిరుపేదలని కోర్టుల చుట్టూ తిప్పుతూ వారిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. నాగారం గ్రామంలో పోడు సాగు చేస్తుండగా ట్రాక్టర్‌ని అటవీశాఖ అధికారులు బంధించి సీజ్ చేశారని మండి పడ్డారు. ఇకనైనా ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలు అమలు కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మర్మల శంకర్, నాగమలు, కమల, పొల్క జయ, రామయ్య, బయక్క, దుర్గక్క, గంగయ్య, గ్రామ పెద్దలు బైరీ సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌర సన్మానాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పుట్టి నరోజు సందర్భంగా యూనియన్ కార్యాలయంలో ఆగష్టు 13న నిర్వహించనున్న పౌర సన్మానాన్ని యూనియన్ శ్రేణులు, కార్మికులు విజయవంతం చేయాలని ఆ సంఘం సీనియర్ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య కోరారు. కార్మికుల సంక్షేమం వారి భవిష్యత్తు కోసం నిరంతర పోరాటం చేస్తున్న జనక్ ప్రసాద్ పౌర సన్మానానికి కార్మికులు, నాయకులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతన జీఎంగా దేవేందర్ బాధ్యతలు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా జి దేవేందర్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, హెచ్ఓడీలు వారికి ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులందరికీ ఋణ మాఫీ చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడురు. సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో 61 మంది కౌన్సిల్ సభ్యులను 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసంతో గెలిపించారని ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా క్రాఫ్ లోన్ తీసుకున్న ప్రతి రైతుల రుణాలు మాఫీ చేయాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఆసర పింఛన్‌లు, సదరం సర్టిఫికెట్ అందజేయడంలో షరతులు తొలగించాలని పేర్కొన్నారు. వికలాంగులకు రూ.6000, వితంతులకు, వృద్దులకు రూ.4000 పింఛన్ ఇవ్వాలని, స్కీం వర్కర్లందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వంలో వివిధ శాఖల్లో సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, విద్యుత్ సంస్థల నుంచి సింగరేణి కంపెనీకి రావలసిన రూ.29 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలు ప్రకటించి 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటనకే పరిమితం కాకుండా ప్రభుత్వ కార్యాలయం గుర్తించి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, రైతుబంధును వెంటనే షరతులు లేకుండా ప్రతి రైతుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్ , రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, కుంచాల శంకరయ్య చాడా మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లాభాల వాటా వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి లాభాల వాటాలో కార్మికుల 30 శాతం వాటాను వెంటనే చెల్లించాలని సింగరేణి కాలనరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మందమర్రి కార్యాలయంలో ఆదివారం సంఘం ముఖ్య నాయకులతో అయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.29వేల కోట్ల బకాయిలు ఉందని, వెంటనే వీటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ స్టాఫ్‌కి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. అనంతరం మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాతుని సుదర్శన్, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ తిరుపతి గౌడ్, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, వంగరీ రాజేశ్వర్ రావు 11 మన్ సెంట్రల్ అల్టర్నేట్ మెంబర్, శ్రీరాంపూర్ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి మరపెల్లి బాబు, మైనింగ్ స్టాఫ్ ఏఐటీయూసీ కార్యకర్తల సమక్షంలో మందమర్రి ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. మైనింగ్ స్టాఫ్ బ్రాంచి కార్యదర్శి గోపతి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి నాగేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీహరి, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్ట రాజలింగు, ట్రెజరర్ శివకృష్ణ, ఆర్గనైజర్ ఎండీ జావేద్, సెగ్గం శంకర్, బుర్క ప్రశాంత్ లను ఎన్నుకున్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

నవతెలంగాణ-దండేపల్లి

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక చత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో అల్ప సంఖ్యాకులైన ముస్లింలతో హిందువులు అన్నదమ్ముల కలిసిమెలిసి ఉంటున్నారని కానీ రిజర్వేషన్ల గొడవతో మొదలైన బంగ్లాదేశ్ అల్లర్లు ఎటువంటి కారణం లేకుండా చివరకు అల్పసంఖ్యాకులు అయిన హిందువులపై దాడులకు దారితీసిందని అన్నారు. అక్కడి ప్రభుత్వం వెంటనే స్పందించి హిందువులపై దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీసీసీ చైర్మన్‌ను కలిసిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-లక్సెట్టిపేట

తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క అదిలాబాద్ పర్యటనలో భాగంగా ఆదివారం రాత్రి మార్గ మధ్యలో లక్సెట్టిపేట పట్టణంలోని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ఇంటికి వచ్చి ఆయనను కలిశారు. తిరుపతి చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మొదటిసారి మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జీసీసీ చైర్మన్ తిరుపతి మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గంలోని పలు సమస్యలపై ప్రస్తావించగా అన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల, పట్టణానికి చెందిన పలువురు నాయకులు వచ్చి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 7 వార్డ్ కౌన్సిలర్ వెంకటేష్ పాల్గొన్నారు.